RNI No - APTEL/2022/81596

# జనోదయ

janodaya

కరీంనగర్ గురువారం12.03.2026 సంపుటి : 03 సంచిక : 96 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Thurssday 12.03.2026 Volume: 03 Issue 96 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## ప్రజల తీర్పును కాలరాయడమే : కిషన్‌రెడ్డి



**న్యూఢిల్లీ, మార్చి 11 :** దానం నాగేందర్, కడియం శ్రీహరివంటి ఫిరాయింపుదారులకు తెలంగాణ శాసనసభ స్పీకర్ క్లీన్‌చిట్ ఇవ్వడం రాష్ట్ర ప్రజల తీర్పును కాలరాయడమేనని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నాడు కేసీఆర్ సర్కారు అనుసరించిన తీరునే నేడు రేవంత్ ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యానికి అడుగడుగునా అగౌరవం ఎదురవుతోందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచాక సీఎం రేవంత్ సమక్షంలో కండువా మార్చుకుని కాంగ్రెస్ బీ-ఫాం మీద ఎంపీ అభ్యర్థిగా తనపై దానం నాగేందర్ పోటీ చేసిన సాక్ష్యాలు సరిపోవా? అని ఆయన స్పీకర్‌ను ప్రశ్నించారు. కాగా, పార్టీ ఫిరాయింపులపై అసెంబ్లీ స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సార్లు..మార్చింది కండువాలేనంట

# పార్టీలు కాదంట?










- దానం ఎమ్మెల్యేగా గెలిచింది కారు గుర్తు మీద.. ఎంపీగా పోటీచేసింది హస్తం గుర్తుతో
- అయినా ఆయన పార్టీ మారినట్లు కాదంట... బీఆర్ఎస్‌లో ఉన్నట్లే అంట

7లో..

- కడియం ఎమ్మెల్యేగా గెల్చింది బీఆర్ఎస్ బీఫామ్‌తో.. ఎంపీ ఎన్నికలో ప్రచారం చేసింది కాంగ్రెస్ కోసం
- అయినా ఆయన పార్టీ మారలేదు..కారు దిగలేదు

## దానం,కడియంలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే



- వారిద్దరు పార్టీ మారినట్లు ఎటువంటి ఆధారాలు లేవు
- దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు క్లీన్ చీట్ ఇచ్చిన స్పీకర్

ఇప్పటివరకు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేకి క్లీన్‌చీట్ వచ్చింది.స్పీకర్ నిర్ణయం సరైనదా? కాదా? అనేది మనం తప్పుపట్టలేకపోవచ్చు. ఎందుకంటే అత్యున్నత స్థానమైన స్పీకర్ నిర్ణయాన్ని తప్పుపట్టే స్వేచ్ఛ,అధికారం లేకపోవచ్చు.స్పీకర్ స్వతంత్రత విషయంలో మనం పరిధి దాటి మాట్లాడలేకపోచ్చు.అయితే గతంలో పార్టీలు మారిన వారు లేరా? అప్పుడెందుకు వారిపై అనర్హత వేటు పడలేదని అనేవారు ఉన్నారు.ఒక పార్టీ బీఫామ్ మీద పోటీ చేసి మరో పార్టీలోకి ఫిరాయిస్తే అది ఎప్పుడు జరిగినా అనైతికమే.. రాజకీయ పతనమే.గతంలో జరిగినా..ఇప్పుడు జరిగినా.. భవిష్యత్‌లో జరిగినా ఇలాంటి ఫిరాయింపు రాజకీయాలకు ముగింపు పలకాల్సిందే.



కె.ఆర్ ఉన్నమాట

పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్‌చిట్ ఇచ్చారు. వారిద్దరూ పార్టీ మారినట్లుగా ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఈ మేరకు వారి అనర్హత వేటుపై దాఖలైన పిటిషన్లను డిస్మిస్ చేశారు. వారిద్దరూ పార్టీ మారలేదని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతారని స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తుది తీర్పు ప్రకటించారు. దీంతో ఇప్పటి వరకు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మందికి క్లీన్‌చీట్ వచ్చింది.

- ఇప్పటివరకూ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు క్లీన్‌చీట్

## ఎల్పీజీ కొరతపై భయాందోళన వద్దు..

### అనవసరంగా బుకింగ్ చేయవద్దు : కేంద్రం



**న్యూఢిల్లీ:** దేశంలో ఎల్పీజీ సిలిండర్ల కొరతపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో గ్యాస్ బుకింగ్‌లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఎల్పీజీ సిలిండర్ల కొరతపై ఎలాంటి భయాందోళనలు వద్దని తెలిపింది. అనవసరంగా గ్యాస్ సిలిండర్లను బుకింగ్ చేయవద్దని సూచించింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా చమురుతోపాటు ఎల్పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ఎల్పీజీ సిలిండర్ల కొరతతో పాటు రేట్లు పెరుగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ముందు జాగ్రత్త కోసం గ్యాస్ సిలిండర్లు బుక్ చేస్తున్నారు.కాగా, కేంద్ర ప్రభుత్వం బుధవారం దీనిపై స్పందించింది. దేశంలో తగినంత ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని తెలిపింది. ప్రస్తుతం దేశంలో రోజుకు దాదాపు 55 లక్షల బ్యారెళ్ల ముడి చమురు అందుబాటులో ఉన్నదని మీడియా సమావేశంలో ప్రభుత్వ అధికారి వివరించారు.మరోవైపు ఈ కాలంలో సాధారణంగా హోర్ముజ్ జలసంధి ద్వారా వచ్చే దానికంటే ఎక్కువగా చమురు, ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం దేశంలోని డిమాండ్‌ను తీర్చడానికి తగినంత సేకరణ కూడా జరుగుతున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో దయచేసి అనవసరమైన ఎల్పీజీ బుకింగ్‌లను నివారించాలని ప్రజలను కోరింది.

## కేంద్ర మాజీ మంత్రి కావూరి కన్నుమూత

### నేడు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు



**హైదరాబాద్, మార్చి 11 :** కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు(82) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం రాత్రి శ్వాసకోశ సంబంధిత సమస్యలు తీవ్రం కావడంతో బంజారాహిల్స్‌లోని స్టార్ దవాఖానలో చేరారు. అక్కడ వెంటిలేటర్‌పై అత్యవసర చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని బుధవారం సాయంత్రం 5 గంటలకు బంజారాహిల్స్‌లోని నివాసానికి తరలించారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఆయన మనువడు, ఎంపీ శ్రీభరత్ తెలిపారు.

# దరఖాస్తుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## కలెక్టర్ స్నేహ శబరీష్

జనోదయ : మహబూబాబాద్

వివిధ పనుల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఆన్ లైన్‌లో నమోదు చేయాలని,వారి సమస్యలను సావధానంగా పరిశీలించి తగిన విధంగా వెంటనే పరిష్కారం చూ పాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా... గత రెండు మూడు రోజుల నుండి జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాలలో ఫైళ్ల క్లియరెన్స్, సానిటేషన్, కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు.అనవసరమైన స్క్రాప్ ను వెంటనే ఖండం చేయాలని అధికారులకు సూచించినటుగా తెలిపారు.నగర పరిధిలో ఉన్నటువంటి కాలనీలలో విద్యుత్,త్రాగునీరు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చూడాలని,సానిటేషన్ షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని, ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాలు, ప్రాంతాలలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమా



న్ని విజయవంతం చేయాలని తెలిపారు.కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, తహసిల్దార్ రాజేశ్వరరావు, సంబంధిత అధికారులు ఉన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## లక్ష్యం ఉంటేనే విజయం

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనోదయ : జనగాం

ప్రజలకు అవసరమైన వైద్య సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిరంతరం అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. కలెక్టర్ బుధవారం దేవరుప్పుల మండలంలోని సింగరాజుపల్లి లో గల పిహెచ్ సి,జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల,అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..లక్ష్యం ఉంటేనే విజయం...లక్ష్యం ఉంటేనే విషయం సాధ్యమని జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల విద్యార్థులకు విద్యార్థులకు ప్రేరణ కలిగించారు.10వ తరగతి విద్యార్థుల చదువు స్థాయిని తెలుసుకునేందుకు పాఠ్యాంశాలపై కొన్ని ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాలను పరీక్షించారు.అలాగే గణితం,జీవ శాస్త్ర పాఠాలను బోధించారు.ఉపాధ్యాయులు బోధనను మరింత సమర్థమంతంగా నిర్వహించాలని సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో...గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలకు అవసరమైన టీకాలు సమయానికి ఇవ్వాలని వైద్య సిబ్బందినీ ఆదేశించారు.అనంతరం అంగన్వాడి కేంద్రంలో... వంటగదిని పరిశీలించి, పిల్లలకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించి, కేంద్రంలో శుభ్రతను కాపాడాలని, భోజనాన్ని మంచిగా ఉడకపెట్టి అందించాలని సిబ్బందికి సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలకు అందే పోషకాహారం సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.99 రోజుల ప్రణాళికను పగడ్బందీగా నిర్వహించాలి...ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రామంలోని వీధులు, గ్రామంలో చెత్త పేరుకు పోకుండా సమయానికి తొలగించాలని, ప్రజలు కూడా



పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని సూచించారు. పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమాలలో డీపీఓ వసంత, హౌసింగ్ పీడీ మాత్యు నాయక్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానం మహా పుణ్యకార్యం

### ఘనంగా నేత్రదాత జక్కం ప్రేమలత సంస్మరణ సభ

### కుటుంబ సభ్యులకు అభినందనలు

జనోదయ : గోదావరిఖని, మార్చ్ 11

నేత్రదానం మహా పుణ్యకార్యమని గోదావరిఖని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డి.మాధవరావు, సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి అన్నారు. ఎన్టీపీసీ కృష్ణా నగర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ జక్కం మారుతి సతీమణి ప్రేమలత ఈ నెల 1న అకాల మరణం చెందగా, బుధవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్రదాత ప్రేమలతకు ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ... దుఃఖ సమయంలో కూడా ప్రేమలత నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిన కుటుంబ సభ్యులు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.నేత్రదానం ద్వారా ఇతరులకు వెలుగు నింపడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. ప్రేమలత భర్త జక్కం మారుతి, కుమారులు సతీష్--సరిత, సురేష్--సంతోషి



తదితరులను అభినందించారు. అనంతరం సదాశయ ఫౌండేషన్ తరపున వారికి అభినందన పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా జర్నలిస్టు సంఘం ఎథిక్స్ కమిటీ కో-కన్వీనర్ పందిళ్ల శ్యామ్ సుందర్, సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పూదరి కుమార్, సికియర్ జర్నలిస్టులు జక్కం సత్యనారాయణ,రాంశంకర్,అఖిల గాండ్ల రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి కూతురు లక్ష్మణ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వెంకట్రాజం,ప్రతినిధులు నూడిగొండ ప్రకాష్ పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



జనోదయ : మందమర్రి మార్చ్ 11

ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో బాగంగా మండలంలోని చిర్రకుంటలో ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేశారు.బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరంలో గ్రామంలోని 250 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను మండల పశువైద్యాధికారి తిరుపతి ఆధ్వర్యంలో వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని చేపట్టమన్నారు.కార్యక్రమంలో భాగంగా 4 నెలలు దాటిన ప్రతి పాడి పశువుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు.అనంతరం గ్రామ సర్పంచ్ శ్రీ లత మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వల్ల పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయి పాడి రైతుకు ఆర్థిక నష్టం కలుగుతుందన్నారు.పాడి రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న ఉచిత గాలికుంటు నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందె రాంచందర్,కాంగ్రెస్ నాయకులు ఓదెల సంపత్ రావు,కొమురోజు సత్యనారాయణ,తిరుపతి,గోపాల మిత్ర రమేష్,సిబ్బంది రాయమల్లు గ్రామస్థులు పాల్గొన్నారు.

జన్మదినోత్సవాలు,
పదవీ విరమణ
శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190



# 3.36 కోట్ల నిధులు మంజూరు చేయండి

జిల్లా కలెక్టర్‌ను కోరిన రామగుండం మేయర్ మహంకాళి స్వామి

**జనోదయ : గోదావరిఖని, మార్చి 11**

నగరంలో పారిశుద్ధ్యం,నీటి సరఫరా,వీధి దీపాల సమస్యలను పరిష్కరించడానికి రూ 3.36 కోట్ల నిధులు అత్యవసరంగా మంజూరు చేయాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి జిల్లా కలెక్టర్ ని కోరారు. పెద్దపల్లి లోని ఒక ఫంక్షన్ హాల్ లో బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై జిల్లా లోని మునిసిపాలిటీల ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన ఓరియెంటేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో నీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో భాగంగా బోర్ బావుల మరమ్మత్తులు , కొత్త బోర్ బావులు తవ్వడం , లీకేజీలు మరమ్మత్తులు ,విలీన గ్రామాలతో పాటు సరఫరా లేని ప్రాంతాలకు పైప్ లైన్లు వేయడంలాంటి పనులకు ఒక కోటి రూపాయలు,వీధి దీపాల విడి భాగాల కొనుగోలు,కొత్త వీధి దీపాల,కూడళ్లలో మినీ హై మాస్ట్ లైట్లు ఏర్పాటుకు ఒక కోటి ముప్పది ఆరు లక్షల రూపాయలు,పారిశుద్ధ్య వాహనాల మరమ్మత్తులు,బ్లీచింగ్,సున్నం తదితరాలకు మరో కోటి రూపాయల వరకు ఖర్చవుతాయని అంచనా వేశామని అన్నారు.నగర పాలక సంస్థ ఖజానాలో నిధుల కొరత దృష్ట్యా సి ఎస్ ఆర్,డి ఎం ఎఫ్ టి లేదా ఇతర అందుబాటులో ఉన్న నిధుల నుండి అత్యవసరంగా రూ 3.36 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు అంచనాలతో కూడిన ప్రతిపాదనలు సమర్పించారు.సమావేశానికి రామగుండం నుండి శాసన సభ్యులు ఎం ఎస్,రాజ్ ఠాకూర్‌తో పాటు,డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య,కార్పొరేటర్లు,నగర పాలక సంస్థ అధికారులు హాజరయ్యారు.



## ప్రభుత్వ ఆసుపత్రిలో

# ఇంద్ర మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభం



**జనోదయ,గోదావరిఖని,మార్చి 11**

రామగుండం నియోజకవర్గంలోని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో రోగులు,వారి బంధువులకు తక్కువ ధరలో నాణ్యమైన ఆహారం అందించే దుకు ఏర్పాటు చేసిన ఇంద్ర మహిళా శక్తి క్యాంటిన్ ను బుధవారం ఎమ్మెల్యే ఎం.రాజ్ ఠాకూర్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఆసుపత్రికి వచ్చే పేద మరియు మధ్యతరగతి ప్రజలకు పరిశుభ్రమైన,తక్కువ ధరలో భోజనం అందించేందుకు ఈ క్యాంటిన్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మహిళా సంఘాల ద్వారా నిర్వహించబడే ఈ క్యాంటిన్ మహిళల ఆర్థిక స్వావలంబనకు కూడా దోహదపడుతుం దని పేర్కొన్నారు.ప్రభుత్వం మహిళల సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ, మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,ఆసుపత్రి అధికారులు,మహిళా సంఘాల సభ్యులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు ప్రజలు పాల్గొన్నారు.

# గచ్చిబౌలి కార్పొరేటర్‌గా బరిలోకి దేవరకొండ బాలకృష్ణ

**జనోదయ : శేరిలింగంపల్లి మార్చి 11**

సైబరాబాద్ నగరంలోని గచ్చిబౌలి డివిజన్‌లో ప్రజాసేవ లక్ష్యంగా ముందుకు వస్తున్న యువ నాయకుడు దేవర కొండ బాలకృష్ణ తన స్థిరమైన ఉద్యోగాన్ని వదిలి రాజకీ యాలలోకి అడుగు పెట్టడం విశేషంగా మారింది. నాన కరామ్‌గూడలోని కెనరా బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్ గా పనిచేస్తున్న ఆయన,ప్రజలకు మరింత దగ్గరగా ఉండి సేవ చేయాలనే సంకల్పంతో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఆయన రాజకీయ రంగప్రవేశం చేయడం గచ్చిబౌలి ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.జనసేన పారీసిద్ధాంతాలకు ఆకర్షితుడైన దేవరకొండ బాలకృష్ణ,ఆ పార్టీ తరఫున గచ్చిబౌలి కార్పొరేటర్ పదవికి పోటీ చే యడానికి సిద్ధమవుతున్నారు.ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. ప్రజాసేవ చేయాలనే తపన తనను ఈ నిర్ణయం తీసుకునేలా చేసిందన్నారు. ఉద్యోగం ద్వారా పరిమిత స్థాయిలో మాత్రమే సేవ చేయగలిగానని,కానీ ప్రజాప్రతినిధిగా మారితే ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి మరింత అవకాశం ఉంటుందని తెలిపారు.ముఖ్యంగా గచ్చిబౌలి ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు,కాలనీలలో మౌలిక వసతుల లోపం,డ్రైనేజ్ సమస్యలు,పార్కులు,పచ్చదనం పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు.గచ్చిబౌలి ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న ప్పటికీ, పలు కాలనీలలో ఇంకా మౌలిక సదుపాయాల కొరత ఉందని ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శక పాలన అందించ డం తన లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన రాజకీయ ప్రయాణానికి ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు అయిన పారదర్శకత,అవినీతి రహిత పాలన, యువతకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలు తనను బలంగా ప్రభావి తం చేశాయని దేవరకొండ బాలకృష్ణ తెలిపారు. ప్రజల కు సేవ చేయడమే తన ధ్యేయమని,గచ్చిబౌలి అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. స్థిరమైన బ్యాంకు ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవ కోసం రాజకీయాలలోకి రావడం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల మద్దతుతో గచ్చిబౌలి డివిజన్‌ను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో దేవరకొండ బాలకృష్ణ తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు.



## మహిళా సంఘ భవనాలకు

# ఎమ్మెల్యే శంకుస్థాపన



**జనోదయ: గంగాధర మార్చి 11:** మహిళ సంక్షేమానికి పెద్దపీట తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. బుధవారం గంగాధర మండలంలోని కొండన్నపల్లి, హిమ్మత్ నగర్, చిన్నా చంపల్లి, ఉప్పరమల్యాల, గోపాలరావుపల్లి, ఇస్లాంపూర్, వెంకటాయపల్లి, కొండాయపల్లి, చెర్లపల్లి(ఆర్), ర్యాలపల్లి, లింగంపల్లి గ్రామాల్లో రూ.1 కోటి 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘం భవనాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి ప్రారంభించారు. అదేవిధంగా ఇస్లాంపూర్ గ్రామంలో ఎల్లమ్మ దేవాలయ ప్రహరీగోడ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామ్ రాము, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, రెండ్ల శ్రీనివాస్, బిర్ల ఆనందం, గుడి రజిని ప్రవీణ్, బారజు ప్రభాకర్ రెడ్డి, బాసవేణి శ్రీనివాస్, అరె తేజ శ్రీ రాజశేఖర్, దాసరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో హాస్టళ్లకు కమర్షియల్ గ్యాస్ కొరత

ప్రభుత్వ జోక్యం కోరిన ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్

**జనోదయ శేరిలింగంపల్లి :సైబరాబాద్, మార్చి 11**

హైదరాబాద్ నగరంలో హాస్టళ్లకు కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో వేలాది హాస్టల్ నిర్వాహకులు, లక్షలాది మంది అతిథులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలంగాణ రాష్ట్ర ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ (టీఎస్ఐటి సిహెచ్ఏ) ఆందోళన వ్యక్తం చేసింది.ఈ విషయంపై అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాతా కరుణాకర్ మాట్లాడుతూ.. సమస్య తీవ్రతను వివరించారు. హైదరాబాద్ వ్యాప్తంగా సుమారు 11 వేల హాస్టళ్లు ఉండగా, వాటిలో దాదాపు 10 లక్షల మంది అతిథులు నివసిస్తున్నారని తెలిపారు. అయితే అంతర్జాతీయంగా అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల ప్రభావంతో కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. గ్యాస్ డీలర్లు ఇప్పటికే సుమారు 35 శాతం ధర పెంచినప్పటికీ,నిన్నటి నుంచి సరఫరాను పూర్తిగా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ నిర్వహణలో గ్యాస్ ప్రాణవాయువులాంటిదని, గ్యాస్ లేకపోవడం వల్ల వంటలు చేయడం అసాధ్యంగా మారిందని అన్నారు.ఒక సిలిండర్ ద్వారా రోజుకు సుమారు 309 మందికి మాత్రమే భోజనం తయారు చేయగలమని, ప్రస్తుతం సరఫరా లేకపోవడం వల్ల అల్పాహారం,భోజనాల ఏర్పాటులో తీవ్ర సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు.దీనివల్ల లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.డీలర్లతో చర్చలు జరిపినా సమస్యకు సరైన పరిష్కారం దొరకలేదని,కనీసం నామమాత్రంగా అయినా గ్యాస్ సరఫరా చేయాలని కోరామని చెప్పారు.అవసరమైతే డొమెస్టిక్ గ్యాస్ ద్వారా అయినా హాస్టళ్లకు తాత్కాలికంగా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టళ్లను ప్రాధాన్యత రంగంగా గుర్తించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకొని సరిపడ గ్యాస్ అందించాలన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో ఏర్పడిన ఈ సమస్యను ప్రభుత్వము అత్యవసరంగా పరిష్కరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ట్రెజరర్ మహీధర్,నాయకులు జయరామిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి,మధు,సూర్య,ప్రతాప్ రెడ్డి,వర్మ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# జై భీమ్ మహాసేన రథయాత్రకు ఘన స్వాగతం

## సంపూర్ణ మద్దతు తెలిపిన కేవీపీస్

జనోదయ : హనుమకొండ మార్చి 11

హనుమకొండ జిల్లాకు చేరుకున్న జై భీమ్ మహాసేన రథయాత్రకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీస్) జిల్లా కమిటీ ఘన స్వాగతం పలికింది. మానవ హక్కుల పరిరక్షణ సంఘం,కేవీపీస్ నాయకులు రథయాత్రకు పూల దండలతో ఆత్మీయంగా స్వాగతం తెలుపుతూ,యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేవీపీస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ మాట్లాడుతూ,భారత రాజ్యాంగాన్ని ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాన్ని ఆదర్శంగా తీసుకొని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఆయన సూచించారు. అలా చేస్తేనే ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. రథసారథులు మాస్టర్ జి, అంజన్న మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అయినప్పటికీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలుగన్న రాజ్యాంగం పూర్తిస్థాయిలో అమలు కావడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజలకు తమ ప్రాథమిక హక్కులపై అవగాహన లేకపోవడం వల్ల ఆర్థికం



గా,సామాజికంగా వెనుకబాటుతనంకొనసాగుతోం దన్నారు.దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు వెళ్తుందని చెప్పినా,వెనుకబడిన దళితులు,అనాదరిత వర్గాలపై జరుగుతున్న దాడులు ఆ వాస్తవాలను ప్రశ్నిస్తున్నాయని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నవారికే పరిపాలనా ఫలాలు అందుతున్నాయని విమర్శించిన వారు, విద్యా దశ నుంచే రాజ్యాంగ బోధన తప్పనిసరి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కాపాడుకునే పోరాటంలో అవసరమైతే ప్రాణాలైనా త్యాగం చేయడానికి సిద్ధమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విశ్వకళ మండలి గరిగే శ్రీనివాస్,మంద స్వామి,ఎస్కే రాణి, యాదమ్మ, కేవీపీస్ జిల్లా బృందం సభ్యులు రేణి గుంట్ల చందర్,ఇస్లావత్ రవీందర్,గుర్రం రమేష్, ముని సదానందం,కొమురయ్య,నరేష్,రోహిత్,మురళి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

## సివిల్ సర్జన్ పిల్లల వైద్య నిపుణులు డా.మూర్తి

జనోదయ : మందమర్రి మార్చి 11:

విద్యార్థుల్లో ఆరోగ్యం పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సివిల్ సర్జన్ పిల్లల వైద్య నిపుణులు డా. మూర్తి కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం, కళాశాలలో ప్రత్యేక వైద్య నిపుణులచే నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. బాలికల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్న ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.14 సంవత్సరాల బాలికలకు గర్భాశయముఖ ద్వారా క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పివి టీకా ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని అర్హులైన బాలికలను తల్లిదండ్రుల అనుమతితో బెల్లంపల్లి లక్షెట్టిపేట చెన్నూరు మంచిర్యాల మాతా శిశు సంరక్షణ కేంద్రంలలో నిర్వహిస్తున్న టీకా కేంద్రాలకు తరలించాలని సూచించారు.ఈ సందర్భంగా ఆర్బిఎస్కే వైద్యాధికారి డా. పద్మశ్రీ ఆధ్వర్యంలో వైద్య బృందం ప్రాథమిక పరీక్షలు చేయగా, పిల్లల వైద్య నిపుణులు డా. మూర్తి, గైనకాలజిస్ట్ డా. కిరణ్ కుమారి లు పిల్లలను పరీక్షించి అవసరమైన చికిత్సలు నిర్వహించారు. అవసరమైన పిల్లలకు థైరాయిడ్, సికిల్ సెల్ లాంటి నిర్ధారణ పరీక్షల కోసం రక్త నమూనాలు సేకరించి తెలంగాణ డైగ్నో





స్టిక్స్ హబ్‌కు పంపించారు.అనంతరం పాఠశాలలో వంటగది,కూరగాయలు,పప్పు దినుసులు నిల్వ ఉంచిన గదులను పరిశీలించి ప్రత్యేక అధికారికి,వంట మనుషులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా.అనిల్ కుమార్,వైద్యాధికారిణి డా. మానస,హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాందేవ్,కేజీబీవీ ప్రత్యేక అధికారి సునీత, ఆరోగ్య పర్యవేక్షకురాలు విజయ,ఆర్బిఎస్కే ఫార్మసిస్ట్ అజయ్,ఎంఎల్ టి గట్టయ్య,ఏఎన్ఎంలు సుశీల, జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్,ఆశా కార్యకర్తలు,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆలయాలకు భద్రాచలం గోటి తలంబ్రాల అందజేత

జనోదయ : బెల్లంపల్లి మార్చి 11

బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో గల శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం బెల్లంపల్లి శ్రీ కోదండ రామాలయం దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ తాండూర్ స్రవంతి ఆధ్వర్యంలో మాజీ బుగ్గ దేవాలయ చైర్మన్ మాసాడి శ్రీదేవి శ్రీరాములు కు భద్రాచలం రాముల వారి గోటి తలంబ్రాలను అందజేశారు.మహిళలు గోటితో ఒలిసిన తలంబ్రాలను సేకరించి భద్రాచల రాముల వారి కళ్యాణ వేడుకలకు అందించనున్నట్లు వారు తెలిపారు. అనంతరం బుగ్గ ప్రాంతంలోని నూతన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి గోటి తలంబ్రాలను ప్రత్యేక పూజలు నిర్వహించి అందించారు.



## బెల్లంపల్లిలో అంగరంగ వైభవంగా

# శీతలాష్టమి వేడుకలు



జనోదయ : బెల్లంపల్లి మార్చి 11

బెల్లంపల్లి పట్టణంలోని రాజస్థానీ సమాజానికి చెందిన కుటుంబాలు బుధవారం శీతలాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నాయి.పట్టణంలోని గొంతెమ్మ గుట్ట వద్ద సల్లపోచమ్మ ఆలయంలో శీతల మాతకు బసోడా చల్లని ప్రసాదాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించాయి. రాజస్థానీ మహిళలు ఆచారబద్ధంగా పూజలు చేసి కుటుంబంలో ఆనందం, శాంతి,ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం హోలీ కామదహనం తర్వాత ఎనిమిదవ రోజు రాజస్థానీ మహిళలు శీతలాష్టమి వేడుకలను నిర్వహిస్తారు. అంటూ వ్యాధులు,రోగాల నుండి రక్షించే శీతల మాతను పూజించడం వల్ల కుటుంబానికి ఆనందం, శాంతి కలుగుతుందని నమ్ముతారు.శీతలాష్టమి రోజు సూర్యోదయానికి ముందే ఆలయ ప్రాంగణంలో భక్తి శ్రద్ధలతో పూజలు చేసి ఆశీర్వాదం పొందుతారు. ఈ పండుగను ఉత్తర భారత ప్రాంతంలో రాజస్థానీలు ఐక్యత, భక్తిని పెంపొందించేదిగా భావిస్తారు.

## అంగన్వాడీల ద్వారా

# చిన్నారులకు పౌష్టికాహారం

## శంకరపల్లి సర్పంచ్ వెంకటేష్



జనోదయ : మందమర్రి మార్చి 11

5 సం,, లోపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అంగన్వాడీల ద్వారా అందించడం జరుగుతుందని గ్రామస్థులు అంగన్వాడీల సేవలను సద్వినియోగం చేసుకోవాలని శంకరపల్లి గ్రామ సర్పంచ్ పెరుమాండ్ల వెంకటేష్ కోరారు. గ్రామ పంచాయతీ పరిధిలోని సండ్రోన్ పల్లిలో అంగన్వాడి కేంద్రాన్ని బుధవారం సందర్శించి చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యాన్ని పెంపొందించేందు కు గాను ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూను పాటిస్తూ చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతల మణితేజ,పంచాయతీ కార్యదర్శి రాజేష్ కుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయులు లక్ష్మణ్,అంగన్వాడీ టీచర్ సునీత, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భూసార పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి

**వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి**

**జనోదయ : మందమర్రి మార్చి 11**

మండలం లోని రైతులు భూసార పరీక్షలపై అవగాహన పెంచు కోవాలని తద్వారా పంటలపై పెట్టుబడి వ్యయం తగ్గుతుందని మండల వ్యవసాయ విస్తరణాధికారి ముఖ్యం తిరుపతి అన్నారు. 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలం లోని వెంకటాపూర్ గ్రామ రైతులకు భూసార పరీక్షల ప్రయోజనాలు, భూసార పరీక్ష కొరకు మట్టిని సేకరించు సమయం, పద్ధతి భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగంతో కలుగు ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రతి మూడు గంటలకు ఒకసారి భూసారాన్ని పరీక్షించుకొని పరీక్ష ఫలితాల ఆధారంగా



ఎరువులను వినియోగించుట ద్వారా భూమిలో సారం పెరగడమే కాకుండా పెట్టుబడి వ్యయం తగ్గుతుందని రైతులు తమ కమతాల భూసారాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని సూచించారు. సాయిల్ హెల్త్ కార్డు ద్వారా పొందు సమా చారాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ప్రశాంత్, కారోబార్ నరేష్, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీరామ విద్యానికేతన్ వార్షికోత్సవం

**జనోదయ : గోదావరిఖని**

శ్రీరామ విద్యానికేతన్‌లో 44వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ సూర్యదేవర వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగ విచ్చేసిన 58 డివిజన్ కార్పొరేటర్ మేకల సమ్మయ్య 44 సంవత్సరాలుగా అన్ని రంగాల్లో రాణిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న గురువులకు పేరెంట్స్ సహకరించి పిల్లలను క్రమశిక్షణతో పెంచాలని కోరారు జిల్లా గౌరవ అధ్యక్షులు పి.అంజిరెడ్డి, ట్రస్మా అధ్యక్షులు సమ్మారావు, సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, నేషనల్ యూత్ ప్రాజెక్టు అధ్యక్షులు యాదవ రాజు పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం జ్యోతి మాట్లాడుతూ 44 సంవత్సరాలుగా పాఠశాలను పాఠశాలను దిగ్విజయంగా నడుపుతూ గోదావరిఖనిలోనే సీనియర్ పాఠశాలలో ఉన్న గోదావరిఖనిలోనే సీనియర్ పాఠశాలగా ఉన్న శ్రీరామ విద్యానికేతన్ 50 సంవత్సరములు వరకు ముందుకు సాగాలని గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ జరుపుకోవాలని



దీనికి పేరెంట్స్ సహకరించాలని కోరారు గైడ్స్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ స్థాయిలో 19 వ అధ్యాయం లక్నోలో జరిగిన లక్నోలో జరిగిన 19వ జాతీయ జంబోరీలో పాల్గొన్న విద్యార్థులను సన్మానించారు. పాఠశాల పోషకులు ఆటలు పోటీల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులు సాధించారు. విద్యార్థుల డాన్సులు పలువురిని అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా పాఠశాల డాన్స్ మాస్టర్ ఇబ్రహీం ను, 58వ డివిజన్ కార్పొరేటర్ సమ్మయ్య ను స్కూల్ పక్షాన యాజమాన్యం, అతిథులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, పోషకులు, అధిక సంఖ్యలో పోషకులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధుల శిక్షణకు ఏర్పాట్లు చేయాలి

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**జనోదయ : హనుమకొండ**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజాపాలనను మరింతగా ప్రజలకు చేరువ చేయడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం కోసం స్థానిక ప్రజాప్రతినిధులకు సమగ్ర అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. అందుకు అనుగుణంగా నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి సంబంధించి శాఖల వారీగా మినిట్-టు-మినిట్ కార్యక్రమాన్ని రూపొందించి, అవసరమైన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్యం, రోడ్డు భద్రత (అరైవ్ అలైవ్ కార్యక్రమం), సంక్షేమ పథకాల అమలు, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళల సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు వాటి గురించి స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల



వివరాలు, అర్హులైన లబ్ధిదారులకు వాటిని చేరవే యడంలో ప్రజాప్రతినిధులు తీసుకోవలసిన చర్యలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాలు వంటి అంశాలను వివరించాలని తెలిపారు. అలాగే తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, మున్సిపల్ చట్టాలకు సంబంధించిన ముఖ్యాంశాలను ప్రజాప్రతినిధులకు సంక్షిప్తంగా వివరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు సులభంగా అర్థం చేసుకునే విధంగా ట్రైనర్ల సహాయంతో శిక్షణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా. .. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, గ్రామాలు, పట్టణాల్లో శుభ్రత, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఆర్‌డీఓ మేన శ్రీను, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చలో గాంధీ భవన్ పోస్టర్ ఆవిష్కరణ



**జనోదయ : హనుమకొండ మార్చి 11**

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షులు గొర్రె మహేందర్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ శాసనసభ సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డిని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. రాష్ట్ర టీపీసీసీ ఎస్సీ విభాగం నూతన అధ్యక్షునిగా గురువారం రోజున గాంధీభవన్ లో ప్రమాణ స్వీకారం చేయనున్న మానకొండూరు నియోజకవర్గ శాసనసభ సభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కార్యక్రమానికి ఆహ్వానిస్తూ చలో గాంధీ భవన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు గొర్రె మహేందర్ మాట్లాడుతూ జిల్లా నుండి వేలాది మంది దళిత కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమ కొండ జిల్లా ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ నంది పాక భాస్కర్ వర్ధన్నపేట నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ పుట్ట తిరుపతి కాజీపేట మండల ఎస్సీ విభాగం అధ్యక్షులు రామ్ రమేష్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**29వ సారి రక్తదానం చేసిన**

# బీజేపీ నేత కనుకుంట్ల రంజిత్

**జనోదయ : హనుమకొండ మార్చి11**



ఆపదలో ఉన్న వారికి ప్రాణాధారంగా నిలిచే రక్తదానం మరోసారి చేసి ఆదర్శంగా నిలిచారు వరంగల్ బీజేపీ జిల్లా నాయకులు కనుకుంట్ల రంజిత్. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న ఒక రోగికి రక్తం అవసరం ఉందని తెలిసిన వెంటనే ఆయన ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేశారు. ఇది ఆయన చేసిన 29వ రక్తదానం కావడం విశేషం. ఆపదలో ఉన్నవారికి ప్రాణాలు కాపాడే సేవగా రక్తదానం నిలుస్తుంది, సమాజంలో ప్రతి ఒక్కరూ ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని రంజిత్ సూచించారు. "మీలాంటి ఉదార రక్తదాతల వల్లే ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడబడుతున్నాయి" అంటూ పలు వురు ఆయనను అభినందించారు. రక్తదానం ద్వారా సమాజానికి సేవ చేయాలనే సందేశాన్ని ఆయన మరో సారి యువతకు అందించారని స్థానికులుపేర్కొన్నారు.




## పాఠశాల విద్య

# పాత చింతకాయ పచ్చడా?

**విద్యాహక్కు** చట్టం చెప్పిన ఉచిత నిర్బంధ విద్యకు నిర్దేశించిన పాఠశాల విద్య ఎనిమిది దశాబ్దాలుగా అనేక రకాల మార్పులకు, ప్రయోగాలకు గురవుతూ వచ్చింది. సామాజిక డిమాండ్లకు అనుగుణంగా ఉన్నతీకరించబడుతూ వచ్చింది. అపెప్, డిపెప్, లెప్, క్లిప్, క్లాప్స్, క్యూఐపీ, తొలిమెట్టు పేర్లతో బోధనాభ్యాసన పద్ధతులు, కనీస అభ్యసన సామర్థ్యాలు, అభ్యసన ఫలితాలు, సూక్ష్మ సామర్థ్యాలు ఇలా లక్ష్యాధారితంగా ప్రక్రియలు, తెలుగు నుండి ఇంగ్లీషు మాధ్యమానికి, పరీక్షల నుండి నిరంతర సమగ్ర మూల్యాంకనానికి, పునాది అక్షరాస్యత వంటి గుణాత్మక అంశాలకు, ప్రాజెక్టర్లు, కేయాన్లు, ఐఎఫ్పీలు, ట్యాబ్ లు, ఐ ఎక్సెల్ వంటి సాంకేతికతలకు రూపాంతరం చెందిన నేటి విద్య సరయిన ఫలితాలను ఇవ్వలేకపోవడంతో ప్రవేశాలు కేవలం 30 శాతానికి పడిపోయిన దుస్థితి. దాంతో నిర్వహణ భారంతో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చెయ్యడం, జీతాలను లెక్కించే స్థాయికి చేరుకున్నది. దీనిని అదనుగా చేసుకున్న విద్యా కమీషన్ సుమారు 40 పేజీల సూచనలను కేవలం పాఠశాల విద్యపై చేసింది. అయితే వాటిని క్షుణ్ణంగా, లోతుగా అధ్యయనం చేయకుండానే విద్యారంగ వ్యక్తులు, టీచర్లు విమర్శించడానికి జీతభత్యాల తగ్గింపు, స్కూళ్ళ విలీనం, కాంట్రాక్టు నియామకాలు, డీఎడ్ రద్దు, ప్రతిభ ఆధారిత పదోన్నతులు వంటి పైత్యపు ప్రతిపాదనలు కారణమయ్యాయి. అటు విద్యాహక్కు చట్టం, ఇటు సుప్రీంకోర్టు తీర్పుల స్ఫూర్తిని, ఉపాధ్యాయ హక్కుల సాంప్రదాయాలను గోడకేసి కొట్టిన ఈ సరికొత్త సిఫారసులను సర్వత్రా సర్ఫ్ ఎక్సెల్‌తో ఉరుకుతూనే ఉన్నారు.

రాష్ట్రంలో 18,317 ప్రాథమిక పాఠశాలల్లో 30లోగా విద్యార్థుల సంఖ్య ఉన్నవి 10640 అనగా సుమారు 60% అని, వీటివల్ల బడుల నిర్వహణ భారంగా మారడం, విద్యా నాణ్యత లోపిస్తుందని కమిషన్ సూత్రీకరించింది. దానికి పబ్లిక్ స్కూళ్లు మాత్రమే సర్వరోగ నివారిణి అని పరిష్కరించింది. తాజాగా సీఎం మానస పుత్రిక ఆయన "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు" సైతం ఆమోదయోగ్యం కాదని నివేదిక బయట ఆకునూరి మురళి గారు ఢంకా భజాయించారు. తాను చెప్పిందే శాసనమవ్వాలన్న తీరులో బాహుబలి డైలాగ్ చెప్పారు. బడి అందుబాటు అనేది ఆర్టీఈ నిబంధన అన్నది మరిచారు. ఈ విషయంలో వారు తిరిగిన 14 దేశాల్లోని స్థితిగతులను, సిట్యుయేషన్లను ఎక్కడ ఉటంకించలేదు. ఇలాంటి బడుల మీద ఆధారపడినది వారు అమితంగా ప్రేమించే బడుగు బలహీన వర్గాలని మాత్రం గుర్తెరగలేదు. జీరో స్కూళ్లను లేదా అత్యంత తక్కువ సంఖ్య ఉన్న బడులను కొనసాగించాలని ఎవరు కోరుకోవడం లేదు. కానీ పబ్లిక్ స్కూల్ ఒకటి పెట్టి గ్రామీణ విద్య గుడులైన సర్కారు బడులను నోట కరచుకొని పోవడమే అత్యంత దారుణం. విభిన్న ఆలోచనలు కలిగిన విద్యావేత్త మురళి బడులు పునరు జీవించే మంత్రజాలం చేస్తారని అందరూ ఆశించారు. ప్రాథమికోన్నత పాఠశాలలు సగం పైగా 50 లోపు ఉన్నవే. ఉన్నత పాఠశాలలు 4705 అయితే సుమారు 2000 బడుల్లో 100 లోపే సంఖ్య ఉన్నది. ఓ నిర్దిష్ట దూరాల్లో పాఠశాలలను విలీనం చేయడం వేరు. గంపగుత్తగా స్థానభ్రంశం చెందించడం వేరు. ప్రస్తుత ఆర్థిక స్థితిలో సుమారు 36 వేల కోట్ల పెట్టుబడి ఎలా సాధ్యం? ప్రాథమిక పాఠశాలల్లో 5 గదులున్నవి 2100 పాఠశాలలే అయితే ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నవి మాత్రం రెండంకెల సంఖ్య అయి ఉంటుంది. పరిశోధిస్తే మరో పరిష్కార మార్గం దొరికి ఉండేది. కానీ వారి టార్గెట్ కేవలం పబ్లిక్ స్కూళ్ల పితామహుడిగా నిలిచిపోవడమే అయినప్పుడు వేరే ఆలోచనలు ఎందుకు వస్తాయి?

పాఠ్యప్రణాళిక బట్టీ విధానానికి అనుగుణంగా ఉందని, ప్రశ్నించడం, విశ్లేషించడం, నిజజీవితన్యానికి అనుగుణంగా లేదని రాయడం ఒక పెద్ద తప్పుడు రాత. విద్యా హక్కు చట్టం అమలయ్యాక సీసీఈ అనేక మార్పులకు లోనయ్యింది. నేరుగా ఉండే ప్రశ్నలు ఒకటో తరగతి మొదలు ఎస్సెస్సీ కొరకు ఎక్కడా లేవు. జిల్లా పరీక్షల బోర్డు నుండి సెకండరీ బోర్డు వరకు తార్కిక ఆలోచనలకు, సృజనాత్మకతకు, అన్వయానికి అవకాశం ఉన్నవే. కృత్యాలు నేరుగా పాఠ్యపుస్తకం లోని పొందుపరచడం, అనుబంధంగా వర్కుబుక్కు, ఇవన్నీ రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి ఆధ్వర్యంలో నిరంతరంగా సాగుతున్నాయి. ఇంగ్లీషు మాధ్యమం, డిజిటల్ విద్య, పరీక్షల తీరుపై, ఫౌండేషనల్ నైపుణ్యాలపై లెక్కకు మిక్కిలి వృత్యంత శిక్షణలు, వాటికి తోడు ఆన్లైన్ కోర్సులు, జూమ్ సమావేశాలు నడుస్తూనే ఉన్నాయి. విద్యార్థి




సమగ్ర అభివృద్ధి కోసం సహపాఠ్య అంశాలు ఉన్నాయి. వాటిపై కాస్త దృష్టి తగ్గినా విద్యార్థి కేంద్రీకృత విద్య ప్రశాంతం పైగా సాగుతున్నప్పటికీ వారు పక్కదారి పట్టించడమే బాధాకరం.

వారు రాసిన, గమనించిన మంచి విషయాలు ఏమైనా ఉన్నాయంటే పర్యవేక్షణ పోస్టుల కొరత, పరీక్షల భారంతో పాటు అత్యంత ముఖ్యమైనది బోధ నేత్ర పనుల వల్ల తగ్గిన బోధనా అభ్యసన సమయం, బహుళ తరగతుల బోధనవల్ల నాణ్యత తగ్గుతుందనడం. హైదరాబాద్ యూనివర్సిటీ, యూనిసెఫ్‌తో సమగ్ర శిక్ష ఉమ్మడిగా చేసిన సర్వే ఫలితంలో ఉపాధ్యాయులు కేవలం మూడు గంటల సమయాన్ని బోధనకు కేటాయించగలుగుతున్నారని, ప్రతి 15-20 నిమిషాల వ్యవధిలో ఆ సమయానికి అంతరాయం ఏర్పడుతుందని, బోధనేతర రిపోర్టులు రికార్డులు డిజిటల్ యంత్రాల ఆపరేటింగ్ నిర్వహణ కారణాలుగా చెప్పారు. కానీ వీటిని తొలగిస్తామని హామీ మాత్రం ఎక్కడా లేదు. వీటిపై ప్రభుత్వానికి సూచనలు కూడా ఎక్కడా కనపడలేదు.

ప్రొఫెసర్ కార్తీక్ మురళీధరన్ చెప్పినట్లు అత్యధిక వేతనాలు మాత్రమే మెరుగైన అభ్యసన ఫలితాలు ఇవ్వలేవని, స్థానికంగా ఉండడం దానికి మార్గం అన్నారు. పెరిగిన రవాణా సదుపాయాల ప్రస్తావన మరిచి విద్యార్థులను మాత్రం ఊర్లు వాడలు దాటించి పబ్లిక్ స్కూల్ కు పంపాలన్నారు. ఈ ప్రయాణం అక్కడ ఆటంకం కాదన్నారు. ఎటు చేసి ప్రభుత్వానికి భారం దింపాలని అనుకున్నారో, ప్రైవేటు బడులకు బాట పరచాలనుకున్నారో తెలియదు. ప్రపంచ వేతనాల జాబితాలో మన వేతనాలు 70వ స్థానాన్ని, దేశంతో పోలిస్తే 16వ స్థానమని వీరు తిరిగిన 14 దేశాలు, పది రాష్ట్రాల్లో గమనించకపోవడం బాధాకరం. కాంట్రాక్టు టీచర్లు ఎలా విశ్వసనీయత కలిగి ఉంటారో వారికి తెలియాలి. ఇప్పటికే పెన్షన్ పథకాలను మార్చి మార్కెట్ మాయాజాలంలో పెట్టారు. సాధారణ యువకులకు ఉపాధ్యాయ వృత్తి వైపుకు వచ్చే బాటలు అడ్డగించారు. ఇకపై వేతనాలను కూడా తగ్గించి, కాంట్రాక్టు నియామకాలు ఇచ్చేసి, ప్రతిభాధారిత పదోన్నతులిస్తే ఇప్పటికే క్రేజు తగ్గిన టీచర్ పోస్టుకు ఎవరు రావాలో వారే సెలవీయాలి. దానికి బదులు మెడికల్ ఇంజనీరింగ్ వైపు వేలం వెర్రిగా సాగుతున్న అడుగులను ఇటు వైపుగా మళ్ళించే ప్రయత్నం చేసి ఉంటే వారు ఒక సామాజిక శాస్త్రవేత్త అయి ఉండేవారు. బహుళ యాజమాన్యాలు కూడా ఓ తలనొప్పి అయిందన్నారు. అన్నిటికీ పరిష్కారం తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు అన్నారు. కేవలం ప్రభుత్వ స్కూల్లోనే కాక టీచర్లను వేతనాలను కూడా తగ్గించి, పిల్లల విద్య తల్లిదండ్రుల బాధ్యతగా అప్పగించేసి చేతులు దులుపుకొని ప్రైవేటులను బతికించాలన్నదే అప్రత్యక్ష ముక్తాయింపుగా ఉన్నది. నిబంధనలకు తిలోదకాలిచ్చిన ప్రైవేటు, కార్పొరేటులపై కొరడా లేదు. నియంత్రణ స్ట్రాటజీ లేదు. పాపం 5000 జీతానికి పనిచేస్తున్నారన్నారు. కోటి ఏడాది ప్యాకేజీ ఉన్న చైనా ( చైతన్య నారాయణ) టీచర్లు వీరికి తారసపడలేదు. లక్సెంబర్గ్, ఫిన్లాండ్, వియత్నాం, అమెరికా వంటి దేశాల ప్రభుత్వ ఉపాధ్యాయుల సాలరీ స్లిప్పులు వీరికి ఎక్కడా కనపడలేదు. ఆ స్థాయికి ఇక్కడి టీచర్ల వేతనాలు పెంచాలని ఎవ్వరూ ఆశపడడం లేదు. కానీ అకౌంటబిలిటీ లేదని, మార్కెట్ కంటే ఎక్కువ వేతనాలున్నాయని, యాంత్రిక పదోన్నతులు కూడదని, ప్రతిభా పరీక్షలు పెట్టి తొలగించాలని కసాయిగా మాట్లాడడమే నేటి అసలు సమస్య. ఎలుకలున్నాయని ఇల్లు తగలబెట్టిన చందంగా ఈ కథ కొనసాగింది. పాత పాఠశాలలన్నీ తూచ్, కొత్తవి కట్టుకుందామని వారు ప్రతి లైన్లో రాశారు. "ఈ గోడ పగులగొట్టు, సరికొత్త మేడ కట్టు" అని వివిధ భారతిలో చిన్నప్పుడు నాలుగు దశాబ్దాల నాడు విన్న పాట నేడు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నది. క్షేత్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల అనుభవాలు, ఆలోచనలు మరింతగా రంగరించి మార్పులు చేసినపుడే ఈ నివేదిక టేబుల్ పై వరకు చేరుకునే అవకాశం ఉంటుంది. అలాంటి ఫ్లెక్సిబిలిటీ ఉంటుందో లేదో చూడాలి మరి!

**దాసరి శ్రీధర్**
**కరీంనగర్**



# సార్లు మార్చింది..కండువాలేనంట

# పార్టీలు కాదంట?

## వారెవ్వా..ఏం తీర్పు..అచ్చం అనుకున్నట్లే ఉందే?





కె.ఆర్

ఉన్నమాట

ఇప్పటివరకు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేకి క్లీన్‌చీట్ వచ్చింది.స్పీకర్ నిర్ణయం సరైనదా? కాదా? అనేది మనం తప్పుపట్టలేకపోవచ్చు. ఎందుకంటే అత్యున్నత స్థానమైన స్పీకర్ నిర్ణయాన్ని తప్పుపట్టే స్వేచ్ఛ,అధికారం లేకపోవచ్చు.స్పీకర్ స్వతంత్రత విషయంలో మనం పరిధి దాటి మాట్లాడలేకపోచ్చు.అయితే గతంలో పార్టీలు మారిన వారు లేరా? అప్పుడెందుకు వారిపై అనర్హత వేటు పడలేదని అనేవారు ఉన్నారు.ఒక పార్టీ బీఫామ్ మీద పోటీ చేసి మరో పార్టీలోకి ఫిరాయిస్తే అది ఎప్పుడు జరిగినా అనైతికమే.. రాజకీయ పతనమే.గతంలో జరిగినా..ఇప్పుడు జరిగినా.. భవిష్యత్‌లో జరిగినా ఇలాంటి ఫిరాయింపు రాజకీయాలకు ముగింపు పలకాల్సిందే.

- దానం ఎమ్మెల్యేగా గెలిచింది కారు గుర్తు మీద..ఎంపీగా పోటీచేసింది హస్తం గుర్తుతో
- అయినా ఆయన పార్టీ మారినట్లు కాదంట..బీఆర్ఎస్‌లో ఉన్నట్లే అంట
- కడియం ఎమ్మెల్యేగా గెల్చింది బీఆర్ఎస్ బీఫామ్‌తో..
- ఎంపీ ఎన్నికలో ప్రచారం చేసింది కాంగ్రెస్ కోసం
- అయినా ఆయన పార్టీ మారలేదు..కారు దిగలేదు...

కారు గుర్తు మీద పోటీ చేసి గెలుపొందిన 10 మంది శాసన సభ్యులు తాము ఇంకా కారు దిగలేదు..పార్టీ మారలేదని ఇచ్చిన వాంగ్మూలాలను స్పీకర్ విశ్వసించి వారు పార్టీ మారినట్లు సాక్ష్యాలు లేని కారణంగా వారికి క్లీన్‌చీట్ ఇవ్వడంతో సదరు ఎమ్మెల్యేలు ఊపిరి పీల్చుకున్నట్లయింది.ఇరకాటం నుంచి కాంగ్రెస్ సర్కార్ బయటపడినట్లయింది.

పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్‌చిట్ ఇచ్చారు. వారిద్దరూ పార్టీ మారినట్లుగా ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఈ మేరకు వారి అనర్హత వేటుపై దాఖలైన పిటిషన్లను డిస్మిస్ చేశారు. వారిద్దరూ పార్టీ మారలేదని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతారని స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తుది తీర్పు ప్రకటించారు. దీంతో ఇప్పటివరకు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మందికి క్లీన్‌చీట్ వచ్చింది.స్పీకర్ నిర్ణయం సరైనదా? కాదా? అనేది మనం తప్పుపట్టలేకపోవచ్చు.ఎందుకంటే అత్యున్నత స్థానమైన స్పీకర్ నిర్ణయాన్ని తప్పుపట్టే స్వేచ్ఛ,అధికారం లేకపోవచ్చు.స్పీకర్ స్వతంత్రత విషయంలో మనం పరిధి దాటి మాట్లాడలేకపోచ్చు.అయితే గతంలో పార్టీలు మారిన వారు లేరా? అప్పుడెందుకు వారిపై అనర్హత వేటు పడలేదని అనేవారు ఉన్నారు.ఒక పార్టీ బీఫామ్ మీద పోటీ చేసి మరో పార్టీలోకి ఫిరాయిస్తే అది ఎప్పుడు జరిగినా అనైతికమే..రాజకీయ పతనమే.గతంలో జరిగినా..ఇప్పుడు జరిగినా..భవిష్యత్‌లో జరిగినా ఇలాంటి ఫిరాయింపు రాజకీయాలకు ముగింపు పలకాల్సిందే.గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో ఒక పార్టీ గుర్తు మీద పోటీ చేసి శాసనసభ్యులుగా ఎన్నికైన వారికి ఏకంగా మంత్రి పదవులే కట్టబెట్టడం చూశాం.ఇప్పుడు కూడా ఒక పార్టీ ఎన్నికల గుర్తుమీద గెలుపొంది ఇంకోపార్టీ కండువాలు కప్పుకున్న శాసనసభ్యులు 10 మంది ఉన్నారు.

వీరిలో మిగతా వారి విషయంలో పార్టీ మారినట్లుగా ఆధారాలు దొరకలేద ని,వారంతా బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారని స్పీకర్ క్లీన్‌చీట్ ఇచ్చినప్పుడు పెద్దగా ఆశ్చర్య పోలేదు.అయితే బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి విషయంలో స్పీకర్ తీర్పు విస్మయానికి గురిచే స్తోంది.వారు పార్టీ మారినట్లుగా ఆధారాలు లేవని చెప్పడం వింతగానే ఉంది.ఎందుకంటే ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలు పొందిన దానం నాగేందర్ పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ బీఫామ్ తీసుకుని చేతిగుర్తుమీద పోటీ చేసిన విష యం అందరికీ తెల్సిందే.వందేళ్లపైబడి చరిత్ర కల్గిన కాంగ్రెస్ పార్టీలో ఒక ఎంపీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థే కరువై బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మె ల్యేగా గెలుపొందిన దానం నాగేందర్‌కి కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందనుకోవడం అమాయకత్వమే అవుతుంది.పైగా రాష్ట్రంలో అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్‌కు ఒక ఎంపీ స్థానానికి పోటీ చేయడానికి అభ్యర్థి దొరకకపోవడంతో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేకి కాంగ్రెస్ బీఫామ్ ఇచ్చి బలవంతంగా పోటీలో నిలిపినట్లుగా అనుకోవాల్సి ఉంటుంది.ఎవరు ఏమి అనుకున్నా అనుకోకపోయినా ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ మీదనే పోటీ చేశారు.కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయమని బహిరంగంగా ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు.కాంగ్రెస్ ముఖ్యమంత్రి,కాంగ్రెస్ అగ్రనేతల చేతిమీదుగా కాంగ్రెస్ కండువాలు కప్పించుకున్నారు.కాంగ్రెస్ సభల్లో పాల్గొన్నారు.ఇదంతా వందకు నూటయాభైశాతం బహిరంగంగా జరిగిన నిజం.ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలో ఆ దేవుడికే తెలియాలి. ఇక స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీనుంచి కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలుపొందారు.అనంతరం వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా తన కూతురు కడియం కావ్యకు కాంగ్రెస్ టికెట్ వచ్చిన సందర్భంలో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం భహిరంగంగా కాంగ్రెస్ ప్రచార సభల్లో ముఖ్యమంత్రితో పాల్గొన్నారు.కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొన్నారు.కాంగ్రెస్ అభ్యర్థికి ఓట్లు వేయమని బహిరంగంగా అభ్యర్థించారు.ఇప్పటికీ కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొంటున్నారు.ఒక పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన ప్రజా ప్రతినిధి ఇంకో పార్టీ అభ్యర్థికి ఓట్లువేయమని అభ్యర్థించడం..పక్క పార్టీ సమావేశాల్లో పాల్గొనడం పార్టీ ఫిరాయింపుల కిందకు రాదని చెప్పే సాక్ష్యంగా నిలవకపోవడం విడ్డూరమే. న్యాయస్థానంలో ఓ నిందితుడికి శిక్ష పడాలంటే అన్నింటికన్నా ముఖ్యం సాక్ష్యం.నమ్మదగిన సాక్ష్యాలుంటే సంబంధిత నిందితుడికి శిక్షపడుతుంది.మరి దానం నాగేందర్, కడియం శ్రీహరి విషయంలో వారు పార్టీ మారినట్లు బలమైన సాక్ష్యాలున్నా అవి ఫిరాయింపులు జరిగినట్లుగా నిరూపించే సాక్ష్యాలుగా నిలవకపోవడం విచారకరం.ఓ పార్టీ ఎన్నికల గుర్తు మీద పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన అభ్యర్థి మరో పార్టీ ఎన్నికల గుర్తు మీద ఇంకో ఎన్నికల్లో పోటీ చేస్తే దాన్ని ఫిరాయింపు అనక మరేం అంటారో అర్థం కావడం లేదు. మొత్తం మీద కారు గుర్తు మీద పోటీ చేసి గెలుపొందిన 10 మంది శాసనసభ్యులు తాము ఇంకా కారు దిగలేదు..పార్టీ మారలేదని ఇచ్చిన వాంగ్మూలాలను స్పీకర్ విశ్వసించి వారు పార్టీ మారినట్లు సాక్ష్యాలు లేని కారణంగా వారికి క్లీన్‌చీట్ ఇవ్వడంతో సదరు ఎమ్మెల్యేలు ఊపిరి పీల్చుకున్నట్లయింది.ఇరకాటం నుంచి కాంగ్రెస్ సర్కార్ బయటపడినట్లయింది.ఒకవేళ దానం,కడియంల విషయంలో స్పీకర్ అనర్హత వేటు వేసి ఉన్న పక్షంలో అది రేవంత్ సర్కార్‌కి ఇబ్బందికరంగా ఉండేది.కానీ ఆ గండం తప్పినట్లయింది.ఒకవేళ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడే పక్షంలో రాష్ట్రంలో మళ్ళీ ఉప ఎన్నికలు వచ్చి ఉండేవి.అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేపక్షంలో తమ పాత పార్టీకి,శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి మళ్ళీ ఎన్నికల బరిలో నిలిచి ఉండి ఉంటే గెలుపోటముల సంగతి తర్వాత కనీసం నైతికత అనేదన్నా మిగిలేది.మొదట్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి మళ్ళీ అధికార పార్టీ గుర్తు మీద ఎన్నికలను ఎదుర్కొని పార్టీ మారిన వారిని గెలిపించుకోవాలనే ఉత్సాహాన్ని అధికార కాంగ్రెస్ నేతలు చూపించారు.రానురాను పరిస్థితులు మారి మళ్ళీ ఎన్నికల గోదాలోకి దిగడం శ్రేయస్కరం కాదని వెనకడుగు వేశారు. ఫిరాయింపుల కత్తిని సరియైన సాక్ష్యాలు లేవనే కారణంతో స్పీకర్ తిరస్కరించడం రేవంత్ సర్కార్‌కు ఊరటనిచ్చే అంశమే కావచ్చు..కానీ ప్రజల్లో మాత్రం పలచనవుతున్న విషయం కాదనలేం. గతంలో ఫిరాయింపులు జరగలేదా? ఇప్పుడే జరిగాయా? అనే ఎదురుదాడి చేసి మీడియాల ముందు పెద్ద గొంతులు వేసుకుని అరవచ్చు..అయితే సాక్ష్యాలు..టెక్నికల్ విషయాలతో ఫిరాయింపుల విషయంలో నెగ్గుకువచ్చినా ప్రజలు మాత్రం ఇది అనైతికం అని బలంగా నమ్ముతున్నారు.కావల్సినంత బలం ఉన్నా ఇతర పార్టీల నుంచి శాసనసభ్యులను ఫిరాయించేలా రాజకీయాలు చేయడం ఎన్నటికీ శ్రేయస్కరం కాదు. మొదటి నుంచి పార్టీనే నమ్ముకుని ప్రజల పక్షాన పోరాడుతున్న నేతలకు ఫిరాయింపు నేతలో ప్రాధాన్యం తగ్గి వారు అవమానాలకు గురై పార్టీలో లుకలుకలు మొదలవుతాయి.ఇదే విషయం ఇప్పుడు జగిత్యాల వంటి నియోజకవర్గాల్లో చూస్తున్నాం.ఫిరాయింపుదార్ల భవిష్యత్ ఇప్పుడు బాగున్నా వచ్చే ఎన్నికల్లో ప్రజల్లో పరాభవం తప్పదు. దేశరాజకీయాల్లో ఫిరాయింపుదార్లకు అనేక సార్లు గుణపాఠం ఎదురైన చరిత్రలను మరవలేం. ఇప్పుడు తెలంగాణలో కూడా ఫిరాయింపుదార్లకే పట్టం అనే విషయం అనేకసార్లు నిరూపితమవుతుండటం నిఖార్సయిన కాంగ్రెస్ వాదులను,నేతలను ఇబ్బందిపెడుతోంది. అసంతృప్తితో రగిలే చేస్తోంది.ఈ పరిణామాన్ని అంత తేలిగ్గా తీసుకోలేం.వచ్చే ఎన్నికల్లో తప్పక ప్రభావం చూపెడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

....................

**మానసాని కృష్ణా రెడ్డి**

**9618616110**


..........................

# దానం,కడియంలు

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే

- వారిద్దరు పార్టీ మారినట్లు ఎటువంటి ఆధారాలు లేవు
- దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు క్లీన్ చీట్ ఇచ్చిన స్పీకర్





**» ఇప్పటివరకూ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు క్లీన్‌చీట్**

పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్‌చిట్ ఇచ్చారు. వారిద్దరూ పార్టీ మారినట్లుగా ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఈ మేరకు వారి అనర్హత వేటుపై దాఖలైన పిటిషన్లను డిస్మిస్ చేశారు. వారిద్దరూ పార్టీ మారలేదని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతారని స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తుది తీర్పు ప్రకటించారు. దీంతో ఇప్పటి వరకు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మందికి క్లీన్‌చీట్ వచ్చింది.

పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్‌చిట్ ఇచ్చారు. వారిద్దరూ పార్టీ మారినట్లుగా ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఈ మేరకు వారి అనర్హత వేటుపై దాఖలైన పిటిషన్లను డిస్మిస్ చేశారు. వారిద్దరూ పార్టీ మారలేదని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతారని స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తుది తీర్పు ప్రకటించారు. దీంతో ఇప్పటివరకు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మందికి క్లీన్‌చీట్ వచ్చింది.

బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకోకపోవడంతో ఈ విషయం సుప్రీంకోర్టు దాకా వెళ్లిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, బీ కృష్ణమోహన్‌రెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, టీ ప్రకాశ్‌గౌడ్, ఎం సంజయ్‌కుమార్, జీ మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీల వ్యవహారంపై విడతల వారీగా స్పీకర్ విచారణ జరిపారు. ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్‌చిట్ ఇవ్వగా.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిటిషన్లపై నాలుగు రోజుల క్రితం విచారణ పూర్తి చేశారు. అనంతరం తీర్పును నేటికి రిజర్వ్ చేశారు. తాజాగా తీర్పును ప్రకటించారు.

### దానం నాగేందర్ ఏమన్నారంటే..

స్పీకర్ తనపై అనర్హత వేటు వేసినా పోరాటం ఆపనని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఎంపీగా పోటీ చేయడం తన వ్యక్తిగత విషయమని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఏరోజు పనిచేయలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తనకు ఎప్పుడూ విప్ ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. స్పీకర్ పరిధిలో తాను ఎక్కడా పొరపాటు చేయలేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు.

### బీఆర్ఎస్‌లోనే ఉన్నా.. కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నా : కడియం శ్రీహరి

అనర్హత పిటిషన్‌పై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వాగతించారు. బుధవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో జరిగిన ఫిరాయింపులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నైతిక విలువలు తనకు మాత్రమే వర్తింస్తాయా? కేసీఆర్‌కు వర్తించవా? అని ప్రశ్నించారు. కేసీఆర్ తన హయాంలో జరిగిన ఫిరాయింపులకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. 'కేసీఆర్ క్షమాపణ చెప్పితే నేను రాజీనామాకు సిద్ధం' అని స్పష్టం చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను కేసీఆర్ మంత్రులుగా చేయలేదా? అని ప్రశ్నించారు. టీడీపీ శాసనసభా పక్షం బీఆర్ఎస్‌లో విలీనం కాకముందే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మంత్రిని చేశారని, ఇది నైతికమా? అని సవాల్ విసిరారు. రాజకీయంగా తమను ఎదగకుండా చేయడానికే కేసీఆర్ జిల్లాల విభజన చేశారని కడియం శ్రీహరి ఆరోపించారు. ఎంతో చరిత్ర ఉన్న వరంగల్‌ను ఆరు జిల్లాలుగా చేయడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిపారు. కేసీఆర్ నాయకత్వాన్ని సిద్ధాంతపరంగా విభేదించానని ఎమ్మెల్యే అన్నారు. మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డికి ప్రైవేట్ యూనివర్సిటీలు ఇవ్వడానికే తన స్థానంలో సబితను విద్యా శాఖ మంత్రిని చేశారని ఆయన ఆరోపించారు. ప్రైవేట్ యూనివర్సిటీలకు తాను వ్యతిరేకమని.. అన్ని విషయాలు త్వరలోనే బయటపెడతానని హెచ్చరించారు. ప్రస్తుతం తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. కేసీఆర్‌తో తనకు సిద్ధాంతపరంగా విభేదాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్ సుప్రీం కోర్టుకు వెళ్లినా ఎదుర్కొంటానని.. ప్రజాక్షేత్రంలో తేల్చుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధీమా వ్యక్తం చేశారు.

### రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి.. స్పీకర్ నిర్ణయంపై కేటీఆర్ ఆగ్రహం

బీఆర్ఎస్ బీఫామ్‌తో గెలిచిన దానం నాగేందర్ ఆ పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌తో ఎంపీగా పోటీచేశాడని, అతడిపై అనర్హత వేటు వేయడానికి అంతకంటే సాక్ష్యం ఏం కావాలని బీఆర్ఎస్ వర్కిం గ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. భారతదేశ చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేనంతగా ఇంత అద్భుతమైన నిర్ణయం తీసుకున్నందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సన్మానం చేయాలని ఆయన ఎద్దేవా చేశారు. అద్భుతమైన నిర్ణయం తీసుకున్నందుకు రాహుల్ గాంధీకి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు తాము సన్మానం చేద్దాం అనుకుంటున్నామని కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. ప్రజాస్వామ్యం మీద, రాజ్యాంగం మీద రాహుల్ గాంధీ చేస్తున్న బహిరంగ దాడి ఇదని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం పట్టుకుని తిరిగే రాహుల్‌గాంధీకి సిగ్గు, లజ్జ ఉంటే పార్టీ ఫిరాయింపులపై సమాధానం చెప్పాలి. పార్టీ మారిన వాళ్లను రాళ్లతో కొట్టి చంపాలని రేవంత్‌రెడ్డి అన్నారని, ఇప్పుడు రాళ్లతో ఎవరిని కొట్టి చంపాలని ప్రశ్నించారు.

# లేబర్ కోడ్స్‌పై అవగాహన



**జనోదయ , మందమర్రి మార్చి 11:**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఏరియాలోని జియం కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి శాఖ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) బిశ్వ భూషణ్ ప్రుస్టి హాజరయ్యారు. గౌరవ అతిథులుగా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) మంచిర్యాల ఢ రామగుండం యం.డి. యూసఫ్ చౌటుపల్లి, ఏరియా ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్ (కేకేఓసీ ప్రాజెక్టు ఆఫీసర్) మల్లయ్యలు పాల్గొన్నారు. ముందుగా ఏరియా ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్ మల్లయ్య, ఎస్‌ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్ ఇతర అధికారులు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ బిశ్వ భూషణ్ ప్రుస్టిని సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం వివిధ గనులు, విభాగాల అధికారులు, సంక్షేమ అధికారులు, కాంట్రాక్టర్లకు లేబర్ కోడ్స్ అమలు విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ బిశ్వ భూషణ్ ప్రుస్టి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలను సమగ్రంగా మార్చి నాలుగు లేబర్ కోడ్స్‌గా రూపొందించిందన్నారు. 21 నవంబర్ నుంచి అమలులోకి వచ్చిన ఈ కొత్త కోడ్స్ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, భద్రత, వేతన నిర్మాణం, పారదర్శక ఉద్యోగ వ్యవస్థ కోసం రూపొందించబడినవని తెలిపారు. వీటి అమలుపై సరైన అవగాహన కల్పించడం ద్వారా కార్మికులు, యాజమాన్యానికి ఉపయోగకరమైన మార్గదర్శకాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం జిఎల్ ప్రసాద్, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం బాలాజీ భగవతి, డీజీఎం పర్సనల్ అశోక్, సివిల్ ఎస్‌ఈ శ్రీధర్, డివైపీఎం ఎం.డి. ఆసిఫ్, సీనియర్ పీఓ వంశీతో పాటు అన్ని గనుల అధికారులు పాల్గొన్నారు.

# కడియం శ్రీహరి రాజీనామా చేయాలి

## మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ టి. రాజయ్య.

**జనోదయ, స్టేషన్ ఘన్పూర్**



చట్టసభ నుంచి తప్పించుకున్న స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాజ్యాంగంపై నమ్మకం ఉంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా తన చిత్తశుద్ధిని నిరూపించు కోవాలని మాజీ ఉప ముఖ్య మంత్రి తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. స్టేషన్గన్ ఘన్పూర్ లోని తన నివాసంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మె ల్యేలపై అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయం అసెంబ్లీ చరిత్ర లో బ్లాక్ డే గా మిగిలి పోతుందని విమర్శించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యా న్ని ఖూనీ చేసినట్లుగా ఉన్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చెప్పిన విధంగానే స్పీకర్ వ్యవహరించారని.. ఇది ఎంత మాత్రం స్పీకర్ స్వతహాగా తీసుకున్న నిర్ణయం కాదని విమర్శించారు. బిఆర్ ఎస్ పార్టీలో పదవులన్నీ అను భవించి ఇప్పుడు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ని విమర్శిం చడం ఆయన విజ్ఞతకే వదిలి వేస్తున్నానని అన్నారు. బిఆర్ ఎస్ ప్రభుత్వం సమయంలో పార్టీ మారిన వారిని చట్టబ ద్ధంగా సీఎల్పీ విలీన ప్రక్రియ ద్వారా చేర్చుకున్నారని.. ఎవరి ఇంటికి వెళ్లి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించలేదని వివరించారు.

**కడియం శ్రీహరి కాంగ్రెస్ లోకి వెళ్ళింది నిజం కాదా...**

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇంచార్జ్ దీపా దాస్ మున్షి స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన విషయం ప్రజలందరికీ తెలిసిందేనని అన్నారు. ఒక సభలో కాంగ్రెస్ పార్టీలో చేరానని చెప్పిన కడియం శ్రీహరి, మరోసారి నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని.. ఇంకోసారి తాను ఏ పార్టీలో ఉన్నానో స్పీకర్ చెప్పాలని అంటున్నారని ఎద్దేవా చేశారు. కడియం శ్రీహరికి నిజంగా నైతిక విలువలు ఉంటే ఇప్పటికైనా బిఆర్ఎస్ కండువా కప్పుకొని స్టేషన్ ఘన్పూర్ లో అడుగు పెట్టాలని సవాల్ విసిరారు.

# హైదరాబాద్ భవిష్యత్తు కోసమే మూసీ పునరుద్ధరణ

**పి. జలంధర్ రావు**

**హైదరాబాద్, జనోదయ, మార్చి 11:**

హైదరాబాద్ నగర అభివృద్ధి, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మూసీ రివర్ రేజువేనేషన్ ప్రాజెక్ట్ ఎంతో ముఖ్యమైనదని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పి.జలంధర్ రావు పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కాలుష్యంతో నిండిపోయిన మూసి నది పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయం అని ఆయన అన్నారు. మూసీ నది శుద్ధి చేసి రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తే హైదరాబాద్ నగరానికి కొత్త గుర్తింపు వస్తుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటకం కూడా అభివృద్ధి చెందుతుందని, దీంతో నగర అభివృద్ధికి ఇది కీలకంగా మారుతుందని చెప్పారు. ప్రపంచ స్థాయి నగరాల మాదిరిగా ముసి నది పరిసరాలను అభివృద్ధి చేయడం ద్వారా యువతకు, వ్యాపారాలకు, పెట్టుబడులకు మంచి అవకాశాలు లభిస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.కొంతమంది ఈ ప్రాజెక్ట్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. మూసీ ప్రాజెక్ట్ రాజకీయ ప్రయోజనాల కోసం కాదు, హైదరాబాద్ నగర భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమమని స్పష్టం చేశారు.మూసీ నదీ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగదని, వారికి ప్రభుత్వం సరైన పునరావాసం, అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.హైదరాబాద్ నగరాన్ని మరింత అందంగా, ఆరోగ్యకరంగా, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్తోందని, అందరూ ఈ అభివృద్ధి కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని పి. జలంధర్ రావు కోరారు.







జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్స్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

TELANGANA ANDHRAPRADESH TRADE UNION


Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208. RNI No - APTEL/2022/81596 .. Cell No - 8074124190 .... Printed At SUNDAY PRINTING PRESS,Rangareddy, Hyderabad - 500072 ..Cell No - 7386045673